
26న 'మా తెలుగుతల్లి' భక్తి ప్రవచన కార్యక్రమం

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మా తెలుగు తల్లి సాంస్కృతిక, సాహిత్య, సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న భక్తి ప్రవచన కార్యక్రమం నిర్వహించ నున్నారు. నగరంలోని బ్రూక్‌ఫీల్డ్ గోపాలన్ హ్యాబిటాట్ స్ప్లెండర్‌లో సోమవారం ఉదయం 10-30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన దత్తపీఠ ప్రచారకులు బ్రహ్మశ్రీ నూకల ప్రభాకర శర్మ ప్రవచనం చేయనున్నారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వర్‌రావు నగరంలో గురువారం ప్రకటించారు. తెలుగువారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

గెలుపే ధ్యేయంగా వ్యూహం





- ఉత్కంఠ రేపుతున్న రాజ్యసభ ఎన్నికలు
- వ్యూహాలు-ప్రతివ్యూహాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు రాజ్యసభ స్థానాలకు జరగనున్న ఎన్నికలకు అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎత్తులు పై ఎత్తులు వేస్తున్నాయి. నాలుగు స్థానాలకు గాను ఐదుగురు అభ్యర్థులు బరిలో దిగుతుండంతో ఈ నెల 27న జరిగే పోలింగ్‌లో అదృష్టం ఎవరిని వరిస్తుందనే అంశంపై సర్వత్రా కుతూహలం నెలకొని ఉంది. శాసనసభలో ఉన్న బలాబలాల ప్రకారం కాంగ్రెస్ మూడు, బీజేపీ ఒక స్థానాన్ని సులభంగా గెలుచుకుంటాయి. అయితే అనూహ్యంగా బీజేపీ-జేడీఎస్ కూటమి తరుపున ఐదో అభ్యర్థిగా రియల్‌ఎస్టేట్ పారిశ్రామిక వేత్త కుపేంద్రరెడ్డి రంగంలోకి దిగడంతో రాజకీయం వేడెక్కిన సంగతి తెలిసిందే. తమ వద్ద ఉన్న 19 ఓట్లతో పాటు బీజేపీ అదనపు ఓట్లను వినియోగించి గెలుపుకు అవసరమయ్యే ఓట్లకోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు గాలం వేసే పనిలో జేడీఎస్ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందుకు ఆత్మసాక్షి ఓటు నినాదాన్ని తెర పైకి తెచ్చింది. ఈ నేపథ్యంలో బీజేపీ-జేడీఎస్ నేతలు తెర వెనుక జోరుగానే మంత్రాంగం చేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రిపదవులు దక్కక, నియోజకవర్గాలకు అభివృద్ధి గ్రాంట్లు మంజూరు కాక అసంతృప్తితో రగిలిపోతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలే వీరి టార్గెట్‌గా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. తమ ఎమ్మెల్యేకు ఎర వేస్తున్నారని కొందరిని ఈడీ దాడుల పేరిట బెదిరిస్తున్నారంటూ ఉప ముఖ్యమంత్రి డీకే.శివకుమార్ ఆరోపించగా తమది అలాంటి సంస్కృతి కాదని నిజానికి సెటిల్‌మెంట్ సంస్కృతి కాంగ్రెస్‌దేనని మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ. కుమారస్వామి ఘాటుగా బదులిచ్చారు. ఎవరికి వారు స్వచ్ఛందంగా ఓటు వేస్తారని, బలవంతపెట్టాల్సిన అవసరం లేదన్నారు.

శాసనసభలో బలాబలాలివే...

శాసనసభలో 224 స్థానాలు ఉండగా ఇందులో కాంగ్రెస్‌కు 135 మంది ఎమ్మెల్యేలు, బీజేపీ 66 మంది, జేడీఎస్‌కు 19 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. సర్వోదయ కర్ణాటక పార్టీ తరుపున ఒక ఎమ్మెల్యే, కేఆర్‌పీపీ తరుపున ఒక ఎమ్మెల్యే, ఇద్దరు ఇండిపెండెంట్లు ఉన్నారు. వీరిలో సర్వోదయ కర్ణాటక, మాజీ మంత్రి గాలి జనార్ధన రెడ్డి నాయత్వంలోని కెఆర్‌పీపీ మద్దతు అధికార కాంగ్రెస్‌కే లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇద్దరు ఇండిపెండెంట్ల మద్దతు తమకే అని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించగా తనకు అన్ని పార్టీల్లో స్నేహితులున్నారని ఆత్మసాక్షి ఓట్లతో తాను విజయం సాధిస్తానని జేడీఎస్ అభ్యర్థి కుపేంద్రరెడ్డి ధీమా వ్యక్తంచేశారు.

విజయానికి ఇంకా ఐదు ఓట్లు...

రాజ్యసభ ఎన్నికల్లో విజయానికి ఒక్కో అభ్యర్థికి 45 ఓట్లు అవసరం ఉంది. కాంగ్రెస్ తరుపున ఇద్దరు అభ్యర్థులు సునాయాసంగానే గెలుస్తారు. బీజేపీ అభ్యర్థి కూడా తొలి రౌండులోనే గెలుపొందుతారు. కాగా బీజేపీ వద్ద ఉన్న 21 మిగులు ఓట్లు కలుపుకుంటే జేడీఎస్ బలం 40కు చేరుకుంటుంది. అంటే విజయానికి ఇంకా 5 ఓట్లు అవసరం ఉందన్నమాట. ఈ ఐదుఓట్లను కాంగ్రెస్ నుంచి క్రాస్ చేయించుకోగలిగితే గెలుపు తధ్యమని ప్రతిపక్షాలు అంచనా వేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో కేఆర్‌పీపీ ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి, సర్వోదయ కర్ణాటక ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య, ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు పుట్టస్వామి గౌడ, లతా మల్లికార్జున్‌ల ఓట్లు అత్యంత కీలకం కానున్నాయి. అయితే ఈ నలుగురూ తమవైపే ఉన్నారని కాంగ్రెస్ నేతలు ఘంటాపథకంగా చెబుతున్నారు. ఇదే సమయంలో బీజేపీ అసమ్మతి ఎమ్మెల్యేలు ఎస్‌టి.సోమశేఖర్, శివరాం హెబ్బార్‌ల ఓట్లపై కూడా కుతూహలం నెలకొని ఉంది. ఈ ఎన్నికల్లో విప్ జారీ చేసేందుకు అవకాశం లేకపోవడం ఇందుకు మరో కారణం. పైగా ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు కొద్దికాలంగా కాంగ్రెస్ నేతలతో అత్యంత సన్నిహితంగా ఉంటున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్ మూడో అభ్యర్థి సునాయాసంగా గెలుస్తారన్నది రాజకీయ పండితుల అంచనా.

పక్క పార్టీ నేతలకు వల

ఇదిలా ఉండగా తమ పార్టీ ఎమ్మెల్యేలపై బీజేపీ-జేడీఎస్ నేతలు వల విసురుతుండటంతో కాంగ్రె స్ అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. శాసనసభ సమావేశాలు ముగుస్తూనే శుక్రవారం తమ ఎమ్మెల్యేలను రిసార్టుకు తరలించే సన్నాహాల్లో ఉంది. తమ ఓట్లు చెదిరిపోకుండా ఉండేందుకు స్వయంగా కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉన్నారు. ఈ పరిణామాలు గమనిస్తుంటే తమ అభ్యర్థిని గెలిపించుకోవడం ప్రతిపక్షాలకు అంత సులభం కాదని రాజకీయ పండితులు మదింపు వేస్తున్నారు. అధికార పక్షం తమ సభ్యులను ఎక్కడికక్కడ కట్టడి చేస్తుండంతో ప్రతిపక్షం ఎత్తులు అంత సులభంగా సాగేలా లేవు. అయితే ఎవరి ఎత్తులు ఎలా ఉంటాయో..చివరికి ఎవరు విజయం సాధిస్తారో...ఎవరు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారో అన్న ఉత్కంఠ మాత్రం ఇరు పక్షాల్లోనూ చర్చనీయాంశంగా మారిందని చెప్పవచ్చు. నాలుగు రోజుల్లో విషయం తేలనుందని మాత్రం చెప్పవచ్చు.



బళ్లారిలో అధికారికి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు


జర్నలిస్టులపై దాడులను సహించం

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఖండించిన బళ్లారి జర్నలిస్టులు
- నగరంలో నిరసన ర్యాలీ

బళ్లారి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఏ రాష్ట్రంలోనైనా జర్నలిస్టులపై దాడులను సహించే ప్రసక్తేలేదని కర్ణాటకలోని బళ్లారి నగర జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఈ నెల 18న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హాజరైన రాప్తాడు సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి పత్రిక స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అల్లరి మూకలు చేసిన దాడిని బళ్లారి జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా, ఫొటోగ్రాఫర్లు, విడియోగ్రాఫర్లు గురువారం ఈ సంఘటనపై నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు స్థానిక సమాచార శాఖ కార్యాలయం నుంచి డీసీ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డి.సీ కార్యాలయంలో ఏడీసీ మహమ్మద్ జుబేదాకు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శశిధర్‌మేటీ, మంజునాథ, నరసింహమూర్తి, తిమ్మప్ప చౌదరి, బసవరాజ్, రవికుమార్, బాబు, మల్లికార్జున, రాజేంద్రబాబు, విజయ్ కుమార్, మురళీ, విరేష్, ప్రభాకర్, శ్రీనివాసులు, రెడ్డి, ఫొటోగ్రాఫర్ పురుషోత్తమ, భరత్, శ్రీనివాసులు, పీరాసాబ్, అన్నమేషరావు, నవీన్, ఇతర జర్నలిస్టులు పాల్గొన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు శశిధర్ మేటీ మాట్లాడుతూ, రాజ్యాంగంలో నాలుగోస్తంభంగా ఉన్న మీడియా రంగం పై ఇలా దాడులు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. ఏ రాష్ట్రంలోనయినా జర్నలిస్టులపై దాడులు జరిగితే సహించమని తెలిపారు. మరో సీనియర్ జర్నలిస్టు మంజునాథ మాట్లాడుతూ ఈ దాడులు అత్యంత హేయమైనవన్నారు. తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉందన్నారు.

ప్రజాసంఘాల ఖండన: అనంతపురం ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపైన, కర్నూలు జిల్లాలో మద్దికేర ఆంధ్రజ్యోతి విలేకరిపైన జరిగిన దాడులను కర్ణాటకలోని వివిధ ప్రజాసంఘాలు ఖండించాయి. అలాగే కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఈనాడు కార్యాలయంపై జరిగిన దాడులపై కూడా ప్రజాసంఘాలు స్పందించాయి. పాత్రికేయులు నిర్భీతితో వాస్తవాలను బయట పెడితే వారిపై అధికార పార్టీలు, దాడులు చేయడం అమానుషమని కర్నాటకలోని వివిధ విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పేర్కొన్నాయి.

రిసార్ట్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు




- క్రాస్ ఓటింగ్ భయం...
- రెండురోజుల పాటు అక్కడే మకాం

బెంగళూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుల కోటాలో రాజ్యసభ సభ్యుడిని ఎన్నుకునే ప్రక్రియ వేళ అధికార కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. జేడీఎస్- బీజేపీలు ఐదవ అభ్యర్థిని రంగంలోకి దింపడంతో క్రాస్ ఓటింగ్ జరగకుండా పార్టీ చర్యలు తీసుకుంటోంది. శాసనసభలో పార్టీల పరంగా కాంగ్రెస్ మూడు స్థానాలు, బీజేపీ ఒకస్థానం సంఖ్యాబలంగా సునాయాసంగా గెలువనున్నారు. అయితే బీజేపీ-జేడీఎస్ పార్టీలు మైత్రిగా ఉండటంతో కుపేంద్రరెడ్డిని పోటీ చేయించడంతో కాంగ్రెస్ సభ్యులు ఎవరైనా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడవచ్చుననే ముందస్తుగానే అప్రమత్తమయ్యారు. రాజ్యసభ ఎన్నికలు ఈనెల 27న జరగనున్నాయి. శుక్రవారంతో శాసనసభ సమావేశాలు ముగియనున్నాయి. దీంతో ఆదివారం నుంచి రెండురోజుల పాటు ఎమ్మెల్యేలు అందరూ రిసార్టుకు తరలిరావాలిన సూచించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ విప్ అశోక్‌పట్టణ్ ఈమేరకు గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలకు సూచించారు. కాగా రాష్ట్రం నుంచి రాజ్యసభకు పోటీ చేస్తున్న కేంద్రమాజీ మంత్రి అజయ్‌మాకెన్ రెండురోజులుగా విధానసౌధలోనే గడుపుతున్నారు. పలువురు ఎమ్మెల్యేలను నేరుగా కలిసి మద్దతు కోరుతున్నారు. రాజ్యసభకు కాంగ్రెస్ నుంచి రెండోసారి జీసీ చంద్రశేఖర్, సయ్యద్ నాసిర్‌హుసేన్‌లు పోటీ చేస్తుండగా బీజేపీ నుంచి నారాయణసా భాండగె బరిలో ఉన్నారు. బీజేపీ జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా రాజ్యసభ మాజీ సభ్యుడు కుపేంద్రరెడ్డి పోటీ చేయడంతోనే కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమై రిసార్ట్‌కు తరలించదలచారు. ఇందుకు తగిన ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి.

బీజేపీ- జేడీఎస్ మధ్య సీట్ల ఖరారు!

- అమిత్ షా సమక్షంలో చర్చలు..
- అధికారికంగా వెల్లడించని పార్టీ వర్గాలు



బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సమక్షంలో ఢిల్లీలో బుధవారం రాత్రి బీజేపీ-జేడీఎస్‌ల మధ్య లోక్‌సభ సీట్ల ఒప్పందం దాదాపుగా ఖరారైనట్లు అత్యంత విశ్వశనీయంగా తెలిసింది. రాష్ట్ర బీజేపీ నేతలు ఎవరూ లేకుండానే నేరుగా అమిత్‌షాతో జేడీఎస్ అగ్రనేత మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి.కుమారస్వామి, ఆయ న తనయుడు నటుడు నిఖిల్ భేటీ కావడం గమనార్హం. ఈ సమావేశంలో జేడీఎస్‌కు మూడు సీట్లు కేటాయించేందు కు అమిత్ షా అంగీకరించారని తెలుస్తోంది. నియోజకవర్గాల పేర్లు బహిర్గతం కానప్పటికీ పార్టీ వర్గాలు అందించిన సమాచారం ప్రకారం మండ్య, హాసన్, తుమకూరు నియోజకవర్గాలు దక్కనున్నట్లు తెలుస్తోంది. మరోపక్క మండ్యలో గు రువారం సిట్టింగ్ ఎంపీ సినీనటి సుమలతా అంబరీష్ మీడియాతో మాట్లాడుతూ మండ్యలో తాను పోటీ చేయడం దా దాపు ఖాయమన్నారు. ఒకవేళ ఈ సీటును జెడీఎస్‌కు కేటాయిస్తే సుమలత పరిస్థితి ఏమిటన్నదీ ఇంకా స్పష్టం కావడం లేదు.

విధానసౌధ ముందు హుండీ పెట్టుకోండి



- సర్కార్‌కు బీజేపీ సలహా
- ఆలయాల్లో పన్ను వసూలుపై ఆగ్రహం



బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్యారెంటీ పథకాలతో ఆర్థికంగా దివాలా తీసిన ప్రభుత్వం ఆదాయం అధికంగా ఉన్న హిందూ ఆలయాలపై కన్నేసిందని బీజేపీ మండిపడింది. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బివై.విజయేంద్ర నగరంలో గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కోటిరూపాయాలకు పైగా ఆదాయం గడించే హిందూ దేవాలయాలు ప్రభుత్వానికి రూ.10 లక్షలు పన్నురూపంలో చెల్లించాల్సి ఉంటుందన్న ఆదేశాలను ఆయన తప్పుబట్టారు. ఇతర మతాల ప్రార్థనా మందిరాలపై కూడా ఇలా పన్నువేసే ధైర్యం ప్రభుత్వానికి ఉందా? అని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి కార్యక్రమాలకోసం నిధులు లేకపోవడంతో ప్రభుతాన్ని నడిపించేందుకు ఇలాంటి తలా తోకా లేని నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆయన విరుచుకుపడ్డారు. ఆలయాలపై పన్నులు వేసేకంటే విధానసౌధ ముందు ఒక హుండీ ఉంచి దాతల నుంచి సాయం కోరితే బాగుంటుందని ఆయన ఎద్దేవా చేశారు. దక్షిణాదిలోనే కర్ణాటక అత్యంత ధనిక రాష్ట్రమని, పన్నులు, సాఫ్ట్‌వేర్ ఎగుమతుల రూపంలో లక్షల కోట్ల ఆదాయం లభిస్తున్నా ఇలాంటి దుస్థితి ఏనాడూ రాలేదన్నారు. గ్యారెంటీలలో ప్రజాధనాన్ని అడ్డగోలుగా ఖర్చుపెట్టేస్తున్నారని ఆయన విమర్శించారు. గ్యారంటీలకు తాము వ్యతిరేకం కాదని ఇదే సమయంలో ఆర్థిక క్రమశిక్షణ కూడా ఉండాలన్నదే ఉద్దేశమన్నారు. నిధుల కొరత రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 224 శాసనసభా నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా స్తంభించాయని ఆయన ఆరోపించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల్లోనూ దీనిపై అసంతృప్తి రగులుతోందన్నారు. హిందువులు చెల్లించే పన్నులను పూర్తిగా హిందువుల కోసమే ఖర్చుపెట్టాలని బీజేపీ ఎమ్మెల్యే యత్నాళ్ డిమాండ్ చేశారు. హిందువుల పన్నులు హిందువుల హక్కు నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళతామని గురువారం ఆయన బెంగళూరులో ప్రకటించారు. కాగా కోటి రూపాయలకు పైగా ఆదాయం వచ్చే దేవాలయాలలో 10 శాతం ప్రభుత్వం స్వీకరించి ఆదాయం అంతగా లేని ఆలయాల అభివృద్ధికి ఖర్చుచేస్తుందని ఈ విషయంలో ప్రతిపక్షాలు ప్రజలను దారితప్పించే వ్యాఖ్యానాలు చేస్తున్నాయని దేవాదాయ. రవాణా శాఖ మంత్రి ఆర్.రామలింగారెడ్డి మండిపడ్డారు.

భారత్‌లో విద్యార్థులకు అద్భుత అవకాశాలు

రామయ్య వర్సిటీలో ఇలినాయ్స్ విశ్వవిద్యాలయ ప్రతినిధులు

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భారత్‌లో విద్యార్థుల అన్వేషణలకు అద్భుతమైన అవకాశాలున్నాయని, ఇలినాయ్స్ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల బృందం ప్రశంసించింది. ఇలినాయ్స్ బృందం బెంగళూరులో గత మూ డు రోజులుగా పర్యటిస్తోంది. రామయ్య విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఈ బృందానికి ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఛైర్మన్ డా.ఎంఆర్. జయరాంతో కలిసి ఇలినాయ్స్ విశ్వవిద్యాలయం ఛైర్మన్ డా.తిమోతి కిల్లిన్‌లు గురువారం మీడియాతో మాట్లాడారు. దేశంలోనే మూడో అతిపెద్ద నగరంగా ఉన్న బెంగళూరులో ఉన్నత విద్యాశాఖా మంత్రి ఎంసీ సుధాకర్‌ను భేటీ అయ్యామన్నారు. ఇలినాయ్స్ విశ్వవిద్యాలయంలోని గ్రైంగర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో కృత్రిమ మేథస్సు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు 12.5 మిలియన్ డాలర్ల సాయం అందించిన విజ్ఞి ఇన్క్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి విష్ణువర్ధన్‌ను కూడా కలిసి చర్చలు జరిపామన్నారు. భారత్‌లో విద్యారంగం ఆధునీకరణవైపు పరుగులు తీస్తోందని తమ విద్యార్థులకు అద్భుతమైన అవకాశాలున్నట్లు గుర్తించామన్నారు. భారతదేశంలోని పలు విశ్వవిద్యాలయాలతో ప్రత్యేకించి రామయ్య యూనివర్సిటీతో ఇలినాయ్స్ విశ్వవిద్యాలయానికి దీర్ఘకాలంగా ఆత్మీయ సంబంధాలున్నాయన్నారు. తమ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించేందుకు 2000 సంవత్సరం నుంచి ఇంతవరకు 50వేల మంది భారతీయ విద్యార్థులు తమపేర్లను రిజిష్టర్ చేసుకున్నారని ప్రస్తుతం 4,900 మంది విద్యార్థులు పలుకోర్సులు చేస్తున్నారన్నారు. కాగా ప్రపంచంలోనే నూతన ఆవిష్కరణలు, పరిశోధనల్లో తమ విశ్వవిద్యాలయం అగ్రస్థానంలో ఉందని సుమారు 94,700 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని ఏటా 27వేల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పుచ్చుకుంటున్నారన్నారు. కృత్రిమ మేథస్సు, సైబర్ సెక్యూరిటీ, ఇంధన సంరక్షణ, ఇత్యాది రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీటవేస్తున్నామని రామయ్య అప్లయ్డ్ సైన్స్ యూనివర్సిటీ ఛాన్సులర్ డా.ఎంఆర్.జయరాం పేర్కొన్నారు. ఇలినాయ్స్ విశ్వవిద్యాలయంలో కలిసి పనిచేసేందుకు తాము ఎంతో ఆసక్తితో ఉ న్నామని విద్యార్థులు, విద్యానిపుణుల పరస్పర వినిమయానికి చక్కటి అవకాశాలున్నాయన్నారు. ఇలినాయ్స్ బృందంలో ట్రస్టీ, బోర్డు ఛైర్మన్ డాన్ ఎడ్వర్డ్స్ అభివృద్ధి, రీసెర్చ్ విభాగం ఉపాధ్యక్షుడు జె.వాల్ట్ తదితరులున్నారు.



మీడియాతో గోకుల ఫౌండేషన్ ఎడ్యుకేషన్ చైర్మన్ మాట్లాడుతున్న ఎంఆర్.జయరాం


సంగీతా మొబైల్స్ వ్యవస్థాపకులు

నారాయణరెడ్డికి కనకాభిషేకం

బెంగళూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మొబైల్ రీటైల్‌రంగంలో నంబర్‌వన్‌గా రాణిస్తున్న సంగీతా మొబైల్స్ సంస్థ వ్యవస్థాపకులు నారాయణరెడ్డికి కనకాభిషేకం బెం గళూరులో అట్టహాసంగా జరిగింది. గురువారం ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలోని ఉత్సవ రిసార్ట్‌లో కార్యక్రమం జరిగింది. నారాయణరెడ్డిను సమీపబంధువులు, పలువురు వ్యాపార నిపుణులు శాలువాలు కప్పి, పూలమాలు వేసి సత్కరించారు. ఇదే సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ తన పట్ల బంధుమిత్రులతో పాటు వ్యాపారవర్గాలకు చెందిన ప్రముఖులు చూపిన ఆదరణ సంతోషం కలిగించిందన్నారు. కాగా నారాయణరెడ్డి మునిమనవడు సంగీతా మొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుభాష్‌చంద్ర వారసుడు డైరెక్టర్ చందు కుమారుడికి రాణ అనే నామకరణం చేశారు. కార్యక్రమంలో సంగీతా మొబైల్స్ ఎండీ సుభాష్‌చంద్ర కుటుంబసభ్యులు, ఆయన వియ్యంకుడు నందనా గ్రూప్‌హోటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ రవిచందర్, ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ రమేష్‌రాజు, అడియార్ ఆనంద భవన్ స్వీట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ విష్ణుశంకర్‌తో పాటు సంగీతా మొబైల్స్ ముఖ్యులు భాగస్వామ్యులయ్యారు.



నారాయణరెడ్డిని సత్కరిస్తున్న బంధుమిత్రులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.55	1,608.23
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	507	11,227
సామర్థ్యం (టీఎంసీలు)	9.11	34.22

ఘనంగా ఉచ్చీరప్ప తాతకు పూజలు



ఉచ్చీరప్ప తాతకు ప్రత్యేక అలంకరణ

సిరుగుప్ప, ఫిబ్రవరి 22 : ఉచ్చీరప్ప తాతకు ఘనంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. సిరుగుప్ప పట్టణం 24వ వార్డులో వెలసిన ఉచ్చీరప్ప తాతకు అర్చకులు పుష్పాలంకార సేవలు, ఆకుపూజ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేపట్టారు. ఈ కారణంగా భక్తులు స్వామి ఆశీర్వాదంకోసం బారులుతీరారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న విద్యాధికారి

సిరుగుప్ప, ఫిబ్రవరి 22 : పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని విద్యాశాఖాధికారి గురప్ప విజ్ఞప్తిచేశారు. సిరుగుప్ప పట్టణం 5వ వార్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం మధ్యాహ్న భోజన పథకం కింద పౌష్టికాహారం అందించడంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని తహసీల్దార్ షంషాలం ప్రారంభించారు. విద్యాశాఖాధికారి గురప్ప మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులు చక్కగా చదువుకుని అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులు పౌష్టికాహారం అందించడంపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా తాలుకా పంచాయతీ ఈవో పవన్‌కుమార్, పీఆర్సీ తమ్మన్న గౌడ పాటిల్, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, మధ్యాహ్న భోజన పథకం అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రారావి యల్లమ్మదేవి ఆలయ జీర్ణోద్ధరణ



ఆలయంలో పూజలు చేస్తున్న సిద్ధలింగ స్వామి

సిరుగుప్ప, ఫిబ్రవరి 22: హోళబళ్లారి సిద్ధలింగ స్వామి చేతుల మీదుగా రారావి యల్లమ్మదేవి నూతన ఆలయ ప్రారంభోత్సవం జరిగింది. యేళ్ల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో రారావి గ్రామస్థులు ఎంతో శ్రద్ధతో నూతన ఆలయాన్ని నిర్మించారు. 24వ తేదీన రథోత్సవం జరుగనుంది. ఈ నేపథ్యంలో రెండు రోజులు ముందుగానే స్వామి పూజలు చేపట్టి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రారావి గ్రామప్రముఖులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

వీరబలయ్యస్వామికి ఘన సన్మానం

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 22: ఆంధ్రప్రదేశ్ కడప జిల్లాకు చెందిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వంశస్థులైన శ్రీ వీరబలయ్యస్వామి గురువారం బళ్లారికి విచ్చేసిన సందర్భంగా ఆయనకు ఘనస్వాగతం లభించింది. నగరంలోని 35వ వార్డు కార్పొరేటర్ మించు శ్రీనివాస్, 34వ వార్డు ప్రముఖులు రాజేశ్వరి సుబ్బరాయుడు, 14వ వార్డు కార్పొరేటర్ బీఆర్ఎల్ శ్రీనివాస్, 3వ వార్డుకార్పొరేటర్ ప్రభంజన్‌ల నేతృత్వంలో వీరబలయ్యస్వామిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి అందరినీ ఆశీర్వదించారు.

విద్య.. సమాజాభివృద్ధి కోసమే..

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ కులపతి రుద్రేశ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రుద్రేశ్ తదితరులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 22: మనం నేర్చుకున్న విద్య మనకే పరిమితం కాకుండా సమాజాభివృద్ధికి ఉపయోగపడాలని విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ కులపతి రుద్రేశ్ అభిప్రాయపడ్డారు. డిపార్టుమెంట్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో గురువారం విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో 'స్పెక్ట్రోస్కోపి అప్లికేషన్‌లలో ఇటీవల పోకడలు' అనే అంశంపై ఒక రోజు ప్రత్యేక సింపోజియంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒకే సబ్జెక్ట్ రీసెర్చ్‌పై దృష్టిపెట్టడం కంటే మల్టీడిసిప్లినరీ రీసెర్చ్‌పై దృష్టి పెట్టాలని, 'దేశాభివృద్ధికి పరిశోధనలు దోహదపడుతాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో రసాయన శాస్త్ర విభాగం నిత్యం ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తోందని కొనియాడారు. ప్రొఫెసర్ సద్యోజాతప్ప మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలద్వారా వర్సిటీ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందిస్తేనే ఉన్నత చదువుల సమయంలో వారు కొత్త అవిష్కరణల గురించి ఆలోచించగలరని ఆయన అభిప్రాయపడ్డారు. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ స్థానిక విభాగం డెక్కన్ వైస్ ప్రెసిడెంట్ యలమగడ మాట్లాడుతూ యువ శాస్త్రవేత్తలు స్పెక్ట్రోస్కోపి, దాని అప్లికేషన్ పద్ధతులను ఉపయోగించి కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ తదితర అనేక సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలన్నారు. ఈసందర్భంగా రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ లోకేశ్, సింపోజియం కన్వీనర్ అరుణ్‌కుమార్ లగశెట్టి, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ, డెక్కన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాగి మాల్ట్ మంచి పోషకాహారం

హెల్త్ మిక్స్ పంపిణీ చేసిన మేయర్ శ్వేత

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 22: చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తొలగించడానికి రాగి మాల్ట్ దోహదపడుతుందని మేయర్ శ్వేత అభిప్రాయపడ్డారు. నగరంలో గురువారం ప్రభుత్వ పాఠశాల హవంబావిలో జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో 1నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ రాగి హెల్త్ మిక్స్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మహానగర కార్పొరేషన్ ప్రధాన పౌరురాలు శ్వేత మాట్లాడుతూ, రాగిలో ఐరన్ కంటెంట్ పుష్కలంగా ఉండటం వల్ల పిల్లల్లో రక్తహీనత పౌష్టికాహార లోపం దూరమవుతాయన్నారు. చిన్నారుల ఆరోగ్య వికాసానికి అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం 10వ తరగతి పిల్లలందరికీ వారంలో మూడు రోజులు మిల్లట్ హెల్త్ మిక్స్‌ను పంపిణీ చేయాలని నిర్ణయించిందని, తద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందుతుందన్నారు. పాఠశాల ఉపసంచాలకులు ఉమాదేవి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన బిడ్డ దేశానికి ఆస్తిగా మారుతుందన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త కార్యక్రమాన్ని అమలు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. డైట్ ప్రిన్సిపాల్ హనుమక్క మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లల ఆరోగ్యం కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. మిల్లెట్ మాల్ట్ బరువు పెరగడానికి , పిల్లల మానసిక శారీరక ఆరోగ్యానికి ఉపయోగపడుతుందన్నారు. పౌష్టికాహారంతోనే మంచి విద్య అందుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు చిన్నారులకు మినుములను పంపిణీ చేశారు. పిల్లలు కూడా మిల్లెట్ మాల్ట్‌ను ఆనందంతో ఆస్వాదించారు. ఈసందర్భంగా మహానగర పాలక సభ్యురాలు కల్పన, అక్షర దాసోహ విద్యాశాఖాధికారి శేఖర్ , హవంబావి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు , జిల్లాప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నింగప్ప, ఎస్డీఎంసీ అధ్యక్షుడు నాగప్ప, పాఠశాల ఉపాధ్యాయుడు రఘురాం , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్నారులకు రాగి మాల్ట్‌ను పంపిణీ చేస్తున్న మేయర్ శ్వేత

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

బళ్లారి రూరల్, ఫిబ్రవరి 22 : బళ్లారి మాతృమహిళా మండలి అధ్యక్షురాలు పుష్పలత గురువారం ఎంజీ ప్రభుత్వ హైస్కూలు పాఠశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థులకు నోట్‌పుస్తకాలతో పాటు పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడుతూ మార్చి నెలలో వచ్చే పబ్లిక్ పరీక్షల సందర్భంగా విద్యార్థులంతా ధైర్యంగా చదువుకుని పరీక్షలు రాయాలని ఆకాంక్షించారు. నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తు తరాలవారికి మార్గదర్శకులుగా వుండాలన్నారు. పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థుల్లో ప్రేరణ కలిగించారు. ఈ కార్యక్రమంలో కే పుష్పచంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ, మాతృమండలి బోర్డు సభ్యులు లలిత, రాధ, స్వప్న, షర్మిత, పద్మ, సునంద తదితరులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న మాతృమహిళా మండలి సభ్యులు

సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు



ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బళ్లారి రూరల్, ఫిబ్రవరి 22: కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన ఆంధ్ర సరిహద్దు వద్ద విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్, సెబ్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డిలు గురువారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కర్ణాటకలో లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సందర్భంగా సరిహద్దు ప్రాంతమైన డోనేకల్లు, విడపనకల్లు చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించారు. బళ్లారిలో జరిగిన బార్డర్ మీటింగ్ అనంతరం సరిహద్దు ప్రాంతాల్లో ప్రతివాహనాన్ని తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ తెలిపారు.

కుడితినిలో త్రిచక్ర స్కూటర్ల పంపిణీ



కుడితినిలో త్రిచక్ర స్కూటర్లు పంపిణీ చేస్తున్న రాజశేఖర్

కంప్లి, ఫిబ్రవరి 22 : కుడితిని పట్టణంలో ఇద్దరికి రెండు త్రిచక్ర స్కూటర్లను కుడితిని పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షులు రాజశేఖర్ గురువారం పంపిణీ చేశారు. ఏసీసీ అదానీ సంస్థ ఐదు స్కూటర్లను ఉచితంగా ఇవ్వగా, అందులో కుడితినికి చెందిన కనికేరి యర్రిస్వామికి, అడవద వన్నూరుస్వామికి ఒక్కొక్కటి వంతున ఇచ్చి, మిగిలిన మూడింటిని ఏళుబెంచి, సిద్దమ్మనహళ్లి, వేణి వీరాపురం గ్రామాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ కేవలం ఏసీసీ అదానీ సంస్థ మాత్రమే కుడితిని, ఏళుబెంచి, సిద్దమ్మనహళ్లి, వేణి వీరాపురం గ్రామాలకు సీఎస్ఆర్ కింద నిధులు ఇస్తోందన్నారు. మిగతా కర్మాగారాలు ఎలాంటి సీఎస్ఆర్ నిధులను ఈ గ్రామాలకు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికే ఏసీసీ అదానీ సంస్థ రూ. పది లక్షలతో మహిళలకు టైలరింగ్ సెంటర్‌ను కుడితినిలో ఏర్పాటు చేసిందని, మోడల్ స్కూలులో రూ. ఆరు లక్షలతో శౌచాలయం, వాటర్ ట్యాంకు, పౌర కార్మికులకు రూ. 64 వేలతో పరికరాలను ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఏసీసీ అదానీ సీఎస్ఆర్ మేనేజర్ షబ్బీర్ మాట్లాడుతూ మూడు పాఠశాలల్లో గెస్ట్ ఉపాధ్యాయులకు వేతనాలు కూడా ఇస్తున్నామని, ప్రభుత్వాస్పత్రిలో నాలుగు సార్లు హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. కుడితిని పట్టణానికి పక్కనేవున్న హరిగిణదోణి గ్రామంలో నీటి సమస్య తమ దృష్టికి రావడంతో మూడు బోర్లు వేయించి నీటి సరఫరా చేస్తున్నామన్నారు. త్వరలోనే కుడితిని పట్టణంలో కూడా నీటిని సరఫరా చేసే పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ ముఖ్య అధికారి తీర్థ ప్రసాద్, కౌన్సిలర్లు వెంకటరమణ బాబు, కనికేరి పంపాపతి, పట్టణ ప్రముఖులు చంద్రయ్య దొడ్డ బసప్ప, అంజి, సండూరు కార్మిక విభాగం అధ్యక్షులు మోటా తిమ్మప్ప, జాకీర్, బూదిగుంప తిమ్మప్ప, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

అర కిలోమీటర్ రోడ్డుపై అరగంట ప్రయాణం



కంప్లి- కొట్టాల మధ్యమట్టిరోడ్డుపై వెళుతున్న వాహనదారులు

కంప్లి, ఫిబ్రవరి 22 : కంప్లి- కురుగోడు రోడ్డులో సన్నాపురం ఉపకాలువ నుంచి కొట్టాలకు వెళ్లేఅరకిలోమీటర్ రోడ్డు పనులు పూర్తిచేయాలని వాహనదారులు కోరుతున్నారు. కంప్లి నుంచి కురుగోడుకు రూ.30 కిలోమీటర్ల దూరం వున్నా 29 కిలోమీటర్లు ఎలాంటి సమస్య లేకుండా ప్రయాణం చేస్తున్నామని, కేవలం ఈ అరకిలోమీటర్ వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే అరగంట సమయం పడుతోందని అంటున్నారు. ఎమ్మెల్యేకు కంప్లి, కురుగోడు రెండు తాలుకాల్లో నివాసాలు వున్నా ఈ రోడ్డుపై దృష్టి పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అరకిలోమీటర్ మట్టి రోడ్డును వెంటనే డాంబర్ రోడ్డుగా మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టీచర్‌గా మారిన జిల్లా పంచాయతీ సీఈఓ



సోమసముద్రం హైస్కూలులో విద్యార్థులకు సోషల్ సైన్స్ బోధిస్తున్న రాహుల్ శరణప్ప

కంప్లి, ఫిబ్రవరి 22 : జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సుంకనూరు గురువారం సోమసముద్రం గ్రామంలో హైస్కూలు విద్యార్థులకు సోషల్ సైన్స్ ఉపాధ్యాయులుగా మారారు. ఉదయం ఆ గ్రామ పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులు, జరగాల్సిన పనులపై ఆరా తీశారు. పక్కనే పాఠశాల వుండటంతో రానున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో వుంచుకుని విద్యార్థులకు సోషల్, సైన్స్ పరీక్షలను ఎలా ఎదుర్కోవాలి, ఎలా పరీక్షలు రాయాలనే విషయం గురించి బోధించారు. అనంతరం ఉపాధ్యాయులతో వివిధ అంశాలపై చర్చించారు. గ్రామ పంచాయతీలు కూడా పాఠశాలలకు విద్యాభ్యాసం కోసం అవసరమైన సమయాలలో సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

మిట్టిమల్కాపూర్ వద్ద రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

రాయచూరు, ఫిబ్రవరి 22 : రాయచూరు తాలూకాలోని మిట్టిమల్కాపూర్ క్రాస్ వద్ద బుధవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. రాయచూరు-మంత్రాలయం అంతర్రాష్ట్ర రహదారిలో జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి జేబుల్లో ఉన్న కాగితాల ఆధారంగా వారిని రాయచూరు నగరంలోని ఇందిరా నగర్‌కు చెందిన పరశురామ్(30), రాఘవేంద్ర(35), గోవింద్(32)గా గుర్తించారు. సంఘటన స్థలాన్ని ఎస్పీ బి.నిఖిల్ పరిశీలించి ప్రమాదాలకు గల కారణాల గురించి ఆరా తీశారు. బైక్ పై యరగేరా వైపు నుంచి నగరం వైపు ముగ్గురు యువకులు వేగంగా వస్తుండగా అంతే వేగంగా వెళుతున్న ఆర్టీసీ బస్సు ఒకటి వారిని వెనకనుంచి ఢీ కొట్టింది. ఇందుకు సంబంధించి యరగేరా పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. అనంతరం మూడు శవాలను పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

హోసూరు జోన్

ఏనుగుల సంచారంపై హెచ్చరికలు



అడవిలో సంచరిస్తున్న ఏనుగులు

హోసూరు(సిప్‌కాట్) ఫిబ్రవరి 22: హోసూరు సమీపంలోని పోడూరు వద్ద కొన్ని రోజుల క్రితం నాలుగు ఏనుగులు కనిపించడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు.. హెచ్చరిస్తున్నారు. ఈ ఏనుగులు తరచూ రాష్ట్ర రహదారి దాటుతున్నాయి. గురువారం హోసూరు రాయకోట రోడ్డులో వాహనాలకు అడ్డుగా రావడంతో వాహనాలు కొద్ది సేపు అక్కడికక్కడే ఆగిపోతున్నాయి. డెంకణీకోట అటవీప్రాంతం నుంచి ఈ ఏనుగులు హోసూరు శానమావు అడవుల్లోకి వచ్చాయి. ఈ ఏనుగులు రాత్రి వేళల్లో అటవీ ప్రాంతానికి సమీపంల్లోని గ్రామాల్లోకి ప్రవేశించి అక్కడి పంటలను దెబ్బతీస్తున్నాయి. తెల్లవారుజామున అటవీ ప్రాంతానికి తిరిగి వెళ్తున్నాయి. గత రాత్రి శానమావు అటవీ ప్రాంతం నుంచి నాయకనపల్లి , రామాపురం, అలియాళం, పోటూరు, బీర్జేపల్లి, శానమావు ప్రాంతాలకు వెళ్లి అక్కడి సాగు చేసిన టమోటా, క్యాబేజీ, పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. సినిగిరిపల్లి రామాపురం, అంబలట్టి ప్రాంతాలు అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉండడంతో ప్రజలు వెంటనే అటవీశాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీశాఖాధికారులు, సంఘటన స్థలానికి చేరుకుని ప్రజలందరినీ అప్రమత్తంగా ఉండాలని, పశువులు మేపేందుకు కొన్ని రోజుల తర్వాతే వెళ్లండని తెలిపారు. రాత్రి సమయంలో పంటలను కాపలా కాసేందుకు వెళ్లవద్దని అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

హోసూరు ఫిబ్రవరి 22: హోసూరు శ్రీమాసాని అమ్మ ఆలయంలో మశాన పూజ, ఉత్సవ పూజ నిర్వహించారు. భక్తులు పాల బిందెలతో వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. హోసూరు బాగలూరు రోడ్డుల్లో సమత్వపురం సమీపంల్లో ఉన్న ప్రసిద్ధ మాశానీ అమ్మ ఆలయంలో ప్రతి సంవత్సరం మాఘ మాసంలో పూజలు జరుపుతారు. అందుకనుగుణంగా ఈ ఏడాది 9 వ తేదిన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం కాగా అధిక సంఖ్యల్లో భక్తులు ఉపవాస దీక్షలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల ప్రధాన ఘట్టమైన గురువారం తేరుపేటలో పచ్చకులంలో నీరు తీసుకు వచ్చి అమ్మకు అభిషేకించారు. అలాగే పాల బిందెలతో కూడ భక్తాదులు అమ్మవారికి అభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. తేరుపేట నుంచి ఊరేగింపుగా బెంగళూరు జాతీయ రహదారి మీదుగా బాగలూరు రోడ్డు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి దీపారాధన చేశారు. విచ్చేసిన భక్తాదులందరికి తీర్థ ప్రసాదాలు అందించారు.

వర్చువల్ రియాలిటీ టెక్నాలజీలో యువకుడి ఘనత

హోసూరు(మత్తిగిరి) ఫిబ్రవరి 22 : వర్చువల్ రియాలిటీ టెక్నాలజీలో హోసూరు యువకుడు ఘనత సాధించాడు. రియాలిటీ టెక్నాలజీ ద్వారా 360 డిగ్రీలలో తిరిగే వీడియోలో హోసూరు టీనేజర్ ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. హోసూరు ఏఎస్‌టీసీ హడ్కోకు చెందిన అశోకన్ కుమారుడు విజిత్(29) కంప్యూటర్ ఇంజనీర్‌గా ఉంటూ చెన్నైల్లోని ఓ ప్రైవేట్ కార్ కంపెనీలో పనిచేస్తున్నాడు. భారతదేశంలోని ప్రధాన నగరాలైన తిరుపతి, యూఎస్ఏతో సహ శ్రీలంక , జార్జియా, దేశాలలో అతను వివిధ ముఖ్యమైన ప్రదేశాలలో వర్చువల్ రియాలిటీ టెక్నాలజీతో 360 డిగ్రీలలో తిరిగే వీడియోను చిత్రీకరించారు. మొత్తంగా 16 నిమిషాల 24 సెకన్లలో 50 ప్రదేశాలను వీడియోల్లో రికార్డు చేసి, వాటి చరిత్రను ప్రజలు తెలుసుకునేలా చేశారు. వరదలు, మంచు, వర్షం వంటి వాతావరణ పరి స్థితులను ఈ వీడియోల్లో చూడవచ్చు. ఫోన్‌లో విజిత్ తీసిన ఈ వీడియో చూస్తే వీక్షకులకు అక్కడ తాము ఉన్న అనుభూతి కలుగుతుందని తెలిపారు. విజిత్ ఇలా వీడియో తీసి ఏసీయాన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా గుర్తింపు పొందాడు.



హోసూరు యువకుడు విజిత్

సమస్యలపై ఎస్‌యూసీఐ ఆందోళన

రాయచూరు, ఫిబ్రవరి 22: జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి బాటలు వేయాలని ఎస్‌యూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. రాయచూరు సమస్యల పరిష్కారంపట్ల ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని నిరశిస్తూ గురువారం జిల్లాధికారి కార్యాలయంవద్ద వారు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, జిల్లాకు ఎయిమ్స్ మంజూరు కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో స్వచ్ఛత పనులను పూర్తిగా చేపట్టాలన్నారు. అంతేకాకుండా రోడ్లను వెంటనే అభివృద్ధిపరచాలన్నారు. ఘనవ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని నగర స్వచ్ఛతను కాపాడాలన్నారు. రవాణా వ్యవస్థను మెరుగుపరచాలని, జాతీయ ఉపాధిహామీ పథకం కూలీని రూ.500కు పెంచాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, ఓపెక్ ఆస్పత్రిని ప్రైవేటు సంస్థకు అప్పగించకుండా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. అదే సమయంలో రిమ్స్ ఆస్పత్రితో పాటు జిల్లా, తాలూకా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలన్నారు. రాయచూరు విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయాలని కోరారు. ఈఎస్ఐ ఆస్పత్రిని మంజూరు చేయాలని కోరారు.



డీసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్‌యూసీఐ నాయకులు

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య

రాయచూరు, ఫిబ్రవరి 22 : తాగుబోతుగా మారిన కొడుకుని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లాలోని మాన్వి పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. మాన్వి పట్టణంలో హేయిర్ కటింగ్ సెలూన్ నడుపుకుంటున్న 24 ఏళ్ల ఆదర్శ ఇటీవల తాగుడు వ్యసనానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కొడుకు భవిష్యత్ పట్ల ఆందోళన చెందిన తండ్రి తాగుడు వ్యసనాన్ని వీడాలని మందలించడంతో కొద్ది సేపు తండ్రితో గొడవపడ్డాడు. అనంతరం ఉన్నట్టుండి బాత్రుమ్‌లోకి వెళ్లిన ఆదర్శ బాత్‌రూమ్ పైప్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మాన్వి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



ఆదర్శ (ఫైల్)

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి (వర్ధంతి)



'కళాప్రపూర్ణ' పురస్కార గ్రహీత మిక్కిలినేని రాధా కృష్ణమూర్తి మూర్తి గుంటూరు జిల్లా లింగాయ పాలెంలో 1914 జూలై 7న జన్మిం చారు. గాంధీజీ పిలుపుతో 15ఏళ్ల ప్రాయంలోనే స్వాతంత్ర్యోద్యమం లో అడుగుపెట్టారు. కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, క్విట్ ఇండియా ఉద్యమంలోనూ పాల్గొని జైలుశిక్షకు గురయ్యారు. స్వాతంత్ర్యానంతరం నిజాం నవాబుకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలోనూ పాల్గొన్నారు. మిత్రుడు కేఎస్ ప్రకాశరావు ప్రోత్సా హంతో సినీరంగంలో అడుగుపెట్టారు. ఆరు అడుగుల ఆజానుబాహుడు, ఖంగున మోగే కంఠస్వరం, సువి శాల ఫాలభాగం వంటివి సినీరంగంలో రాణించేం దుకు దోహదపడ్డాయి. ప్రధానంగా ఎన్టీఆర్‌తో కలసి దాదాపు 150 చిత్రాల్లో నటించారు. పౌరాణిక చిత్రాలు మిక్కిలినేనికి ఎంతో పేరు తెచ్చాయి. సినిమాల్లో నటి స్తున్నా తన ఉన్నతికి కారణమైన నాటక, జానపద కళారంగాన్ని విస్మరించలేదు. రాష్ట్రప్రభుత్వం నుంచి ఎన్టీఆర్ ఆత్మగౌరవ్ పురస్కారం, ఇతర అవార్డులు అందుకున్నారు. 2011 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

స్టాన్ లారెల్ (వర్ధంతి)



స్టాన్ లారెల్ 1890 జూన్ 16న ఇంగ్లండ్ దేశం లాంక్ షైర్‌లో జన్మించారు. ఒలివర్ హార్డీ, లారెల్‌ల ద్వయం సినీ రంగంలో ప్రత్యేక గు ర్తింపు పొందారు. 50కి పైగా సిని మాలలో నటించారు. క్లాజికల్ హా లీవుడ్ కాలంలో ఇద్దరూ కలసి 107 సినిమాలు, 32 షార్ట్ సైలెంట్ ఫిల్మ్స్, 40 షార్ట్ సౌండ్ ఫిల్మ్స్‌లో నటించారు. నాటక రంగంలోనూ, బుల్లితెరపైనా సత్తాచాటుకున్నారు. 1965 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మాజీ ఎంపీ ముద్దే హనుమేగౌడ

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తుమకూరు మాజీ ఎంపి, బీజేపి నేత ముద్దే హనుమెగౌడ గురువారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కెపిసిసి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి, కెపిసిసి అధ్యక్షుడు డికె.శి వకుమార్ ఆయనకు పార్టీ పతాకాన్ని అందజేసి సాదరంగా ఆహ్వానించారు. గతంలో కాంగ్రెస్ ఎంపీగా వ్యవహరించిన ముద్దే హనుమెగౌడ 2019 లోక్‌సభ ఎన్నికల్లో జేడిఎస్‌తో పొత్తు దరిమిలా తనకు టికెట్ ఇవ్వకపోవడంతో బీజేపిలో చేరిపోయారు. కాగా త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఆయనకు బీజేపి టికెట్ కూడా దక్కే అవకాశాలు కనిపించకపోవ డంతో తిరిగి పాతగూటికి చేరుకున్నారు. ఈసందర్భంగా హోంమంత్రి డా.జి.పరమేశ్వర్‌తో పాటు పలువురు సీనియర్ నేతలుహాజరయ్యారు. కాగా తుమకూరు నుండి కాంగ్రెస్ అభ్య ర్థిగా ముద్దే హనుమెగౌడ పోటీ దాదాపు ఖాయమని పార్టీ వర్గాలను ఉటంకిస్తూ తెలిసింది.



ముద్దే హనుమగౌడను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం, డీసీఎం

బాలికపై అత్యాచారం...

బెంగళూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు పరారీలో ఉన్నారు. రామనగర్ జిల్లా మాగడి పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో బాలికపై 56 ఏళ్ళ వ్యక్తి నిరంతరం అత్యాచారానికి పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. బాలికకు ఇటీవల ఆరోగ్య సమస్యలు తలెత్తుతుండటంతో తల్లిదం డ్రులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు జరిపిన వైద్యులు బాలిక గర్భం దాల్చినట్లు నిర్ధారించారు. జరిగిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. ఇంటి చెంతన ఉండే 56 ఏళ బెట్టేగౌడ అనే వ్యక్తి బెదరించి నిరంతరం అత్యాచారం చేసినట్లు తెలిసింది. తల్లిదం డ్రుల ఫిర్యాదు మేరకు మాగడి పోలీసులు ఫోక్సోచట్టం కింద కేసు నమోదు చేశారు. విషయం వెలుగులోకి రాగానే నిందితుడు పరారీ అయ్యారు. పోలీసులు అతడి కోసం గాలింపు జరుపుతున్నట్లు తెలిపారు.

రాజ్యాంగంపై అవగాహన జాగృతి

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ఏర్పడి 75ఏళ్లు పూర్తైన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జాగృతి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రాజరాజేశ్వరినగర్‌లోని గోపాలన్ ఆర్కెడ్ మాల్‌లో విద్యార్థులచే పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. వీధి నాటకాల ద్వారా చైతన్యం కల్పి స్తున్నారు. ఇదే సందర్భంగా రాజ్యాంగంపై మరింత అవగా హన కల్పించేందుకే కార్యాచరణ సాగుతోందని అధికారులు తెలి పారు. 31 జిల్లాల్లోనూ పలు కార్యక్రమాలు సాగుతున్నాయ న్నారు. ఇప్పటికే హాసన్, బెళ గావి, విజయపుర, బెంగళూరు, యాదగిరి, తుమకూరు, చిత్ర దుర్గ, చిక్కమగళూరు, విజయన గర, చిక్కబళ్ళాపుర, కలబురగి, శివమొగ్గ, గదగ్, ధారవాడ, బళ్ళారి, మైసూరు, బాగలకోటె, రాయచూరు, ఉడుపి, బీదర్, తుమకూరు జిల్లాల్లో రథ యాత్ర దాదాపు పూర్తయ్యిందన్నారు. రాజ్యాంగ ఆశ యాలు అందరికీ తెలియచేయడమే లక్ష్యమన్నారు. ఈనెల 23తో జాథా ముగియనుందని తెలిపారు.



రాజ్యాంగ చైతన్య సదస్సు ప్రారంభిస్తున్న అధికారులు

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చికపేట శాసనసభా నియోజకవర్గంలో గరుడా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏ ర్పాటైన కార్య క్రమానికి స్థానిక ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ ముఖ్యఅ తిథిగా హాజరయ్యా రు. ఇదే సందర్భంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను, నోటు పుస్త కాలను పంపిణీ చేశారు. ఆర్థి కంగా వెనుక బడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రతి యేటా ఫౌండేషన్ తరుపున స్కాలర్‌షిప్‌లను, నోటు పుస్త కాలను అందిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ మేదిని ఉదయ్ గరుడాచార్ మీడి యాకు చెప్పారు.



నోటుపుస్తకాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సామూహిక వివాహాలను ప్రోత్సహించాలి



జంటను ఆశీర్వదిస్తున్న స్వామీజీలు

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ, సామూహిక వివాహాలను పోత్సహించాలని ప్రజలకు పలువురు స్వామీజీలు పిలుపునిచ్చారు. బెంగళూరు ఆచార్య శ్రీరాకుమ్ నిర్వహిస్తున్న ఆశ్రమంలో పెరిగి ఉపా ధ్యాయురాలిగా సేవలందిస్తున్న కన్నికా పరమేశ్వరిని ఇం జనీర్ ఎంవి.నాగరాజ్ వివాహమాడేందుకు ముందుకు రావడంతో ఆశ్రమంలో పండుగ వాతావరణం నెలకొంది. గురువారం జరిగిన ఈ ఆదర్శ వివాహానికి స్ఫటికపురి మహాసంస్థానానికి చెందిన నంజావధూత మహాస్వామి, మహర్షి ఆనంద్ గురూజీ, ఆచార్య శ్రీరాకుమ్, ఎమ్మెల్యే ఎస్.ఆర్.విశ్వనాథ్, మాజీ ఎమ్మెల్యే ప్రమీళా నెసర్గి, ఇంటెక్ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు లక్ష్మీవెంకటేష్‌లు ముఖ్యఅతిథు లుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నంజావధూత స్వా మిజీమాట్లాడుతూ జీవితంలో గురువుల ఆశీర్వాదం పొం దడం పూర్వజన్మ సుకృతమన్నారు. రుణానుబంధం ఉంటేనే మనకు ఏదైనా ప్రాప్తిస్తాయన్నారు. శ్రీమంతులకు లభించే ఉత్తమ విద్యాసౌకర్యాలను నిరుపేద కుటుంబాల పిల్లలకు సైతం అందుబాటులోకి తెచ్చిన రాకుంగురూజీ సేవలు ప్రశంసనీయమన్నారు. మహర్షి ఆనంద్ గురూజీ మాట్లాడుతూ నిస్వార్థంగా నిరుపేదలకు చేసే సేవలు భగ వంతుడు ఎంతో ఇష్టపడతాడన్నారు. దురహంకారాన్ని వీడితేనే బతుకు సార్థకమవుతుందన్నారు. ఆచార్య శ్రీరా కుమ్ గురూజీ మాట్లాడుతూ అంధుల పాఠశాలను గత 25 సంవత్సరాలుగా నిర్వహించుకుంటూ వస్తున్నామని అంధులకు, నిరుపేద విద్యార్థులకు ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి కల్పించడమే కాకుండా ఎంతో మందికి ఉపా ధినందిస్తున్నామన్నారు. తమ విద్యాసంస్థలో చదువుకున్న విద్యార్థులకు ఉచితంగా వివాహాలను కూడా జరిపిస్తున్నా మని ఇలా 10 మంది యువతులు ఇక ఇంటివారయ్యార న్నారు. ఖర్చును పూర్తిగా ఆశ్రమమే భరిస్తుందన్నారు.



అరుణ్ యోగిరాజ్‌కు సత్కారం

బెంగళూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నగరంలో విశ్వకర్మ జయంతి ఉత్స వాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాలలో భాగంగా విశ్వమంతటా కొనియాడే లాంటి అయోధ్య రామమందరింలోని రామలల్లా విగ్రహ శిల్పి అరుణ్‌యోగిరా జ్‌ను విశ్వకర్మ సేవాసమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి రామలింగారెడ్డి, ఎంపీ పీసీ మోహన్, అనంత విభూషిత శివ సుజ్ఞాన తీర్థ మహాస్వామీజీ, కాళహస్థీంద్ర మహాస్వామీజీ సహా పలువురు పాల్గొన్నారు. విశ్వకర్మ సమాజానికి చెందిన నేషనల్ షూటింగ్ ఛాంపియన్ టీఎస్ దివ్య, నిమ్హాన్స్ ప్రొఫెసర్ పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సీఆర్ చంద్రశేఖర్, పద్మశ్రీ రాజణ్ణ, వైదేహి మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జిజి తిలక్‌లను విశ్వకర్మ సేవారత్న పురస్కారాలతో సత్కరించారు.

రామలల్లా విగ్రహ శిల్పి అరుణ్‌యోగిరాజ్‌ను సత్కరిస్తున్న మంత్రి రామలింగారెడ్డి తదితరులు

ఎమ్మెల్సీలతో సీఎం గ్రూప్ ఫొటో

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్ సభ్యులతో ముఖ్య మంత్రి సిద్ధరామయ్య విధానసౌధ వద్ద గురువారం గ్రూప్ ఫోటో దిగారు. అధి కార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్షాలైన బీజేపి, జేడిఎస్ ఎమ్మెల్సీలంతా గ్రూప్ ఫోటో సెషన్‌లో ఉత్సాహభరితంగా పాల్గొన్నారు. విధానపరిషత్ సభాపతి బస వరాజహొరట్టితో పాటు సభానాయకుడు బోస్‌రాజు, విధానపరిషత్ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు కూడా హాజరయ్యారు.



లాల్‌బాగ్‌కు కొత్త శోభ

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు లాల్ బాగ్ ఉద్యానవనంలో వన్యప్రా ణుల కళాఖండాలు సందర్శకులను అలరించనున్నాయి. బెంగళూరుహ బ్బలో భాగంగా విధానసౌధ పరిస రాల్లో ఉంచిన కొయ్య ఏనుగులు, వెదురుతో చేసిన ఏనుగులు, వ్యర్థా లతో చేసిన వన్యప్రాణుల కళాఖం డాలను తాజాగా లాల్‌బాగ్‌కు తర లించారు. ఈ సందర్భంగా అటవీ శాఖా మంత్రి ఈశ్వర్‌ఖండ్రే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



కళాఖండాలతో అటవీ శాఖా మంత్రి ఈశ్వర్ ఖండ్రే

బీబీఎంపీకి రూ.300 కోట్ల ఆదాయం

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరులో కొత్తగా నిర్మించే బహుళ అంతస్థుల కట్టడాలకు వసూలు చేసే ఆస్తిపన్నుల్లో అదనంగా 1 శాతం సెస్‌ను వసూలు చేయనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ కీలక నిర్ణయం ఫలితంగా బీబీఎంపీకి ఏటా రూ 300 కోట్ల మేరకు ఆదాయం లభించనుంది. ప్రస్తుత ఏడాది నుంచే ఇది అమ ల్లోకి రానుంది. ఈ విషయాన్ని బీబీఎంపీ ఉన్నతాధికారి ఒకరు నగరంలో గురువారం మీడి యాకు తెలిపారు. అగ్నిమాపక శాఖ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుం దన్నారు. రాజధాని నగరంలో గతకొద్దికా లంగా బహుళ అంతస్థుల కట్టడాల సంఖ్య పెరుగుతోంది. ప్రత్యేకించి నగర శివారు ప్రాంతాల్లో ఇలాంటి కట్టడాలు అధికంగా నిర్మిస్తున్నారని ఆ అధికారి వివరించారు. సెస్ రూపంలో వసూలు చేసే ఈ నిధిని నగరంలో సురక్షతా కార్యక్రమాల కోసం వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.



గుండెపోటుతో తల్లి మృతి

● అనాథలైన అంధ కుమారులు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 22: మండలంలోని గోనేహాళ్ గ్రామంలో వడ్డే రంగమ్మ (47) అనే మహిళ గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందింది. గ్రామ స్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు వడ్డే రంగమ్మ రెండురోజుల క్రితం జ్వరం వచ్చిందని బళ్లారి ఆస్పత్రికి వెళ్లగా అక్కడ చికిత్స అందిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో గురువారం మృతి చెందింద న్నారు. ఈమెకు ఇద్దరు కుమారులు వన్నూరుస్వామి, రంగ న్న ఉన్నారు. వారు పుట్టుకతోనే అంధులు. కుటుం బానికి పెద్దదిక్కుగా వున్న తల్లి మృతి చెందడంతో కుమా రులిద్దరూ అనాథ లుగా మిగిలారని గ్రామస్థులు తెలి పారు. వీరికి తండ్రి భీమరెడ్డి మాత్రమే ఆధార మని అన్నారు.



అనాథలైన అంధ కుమారులు



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా ధ్వజారోహణం

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ధ్వజారో హణ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామిజీ, అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి పంచామృతా భిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. శుక్రవారం శ్రీవారి కల్యాణోత్సవం, ఉచిత సామూహిక వివాహాలు నిర్వహి స్తున్నామని, శనివారం స్వామివారి బ్రహ్మరథోత్సవ నిర్వ హిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బీఎన్‌టీ తిప్పే స్వామి తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి జీఎన్ నర సింహులు, ఉపాధ్యక్షులు ధర్మన్న, సత్యనారాయణ, రాఘ వేంద్రప్రసాద్, కమలాక్షుడు పాల్గొన్నారు.

పత్తాలేని 'భారత్ బియ్యం'

● నిల్వలు లేవంటున్న నాఫెడ్ అధికారులు

బెంగళూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ బియ్యం పథకం వారం దాటినా ఇంకా సామాన్యులకు అందుబాటులోకి రాలేదు. తగిన ముందస్తు ఏర్పాట్లు చేయకుండానే హడావుడిగా పథ కాన్ని ప్రారంభించడం వల్లే సమస్య తలెత్తిందని అధికా రులు అంటున్నారు. ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా నాఫెడ్ ద్వారా అమలు చేస్తున్నారు. కిలో రూ.29చొప్పున 10కిలోల ప్యాకెట్‌లలో అందించదలిచారు. నిల్వలు తక్కు వగా ఉండడం వల్లే ఈ బియ్యాన్ని విక్రయించే సంచార వాహనాలు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగలేదని తెలు స్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం బీపీఎల్ కార్డుదారులకు అన్న భాగ్య పథకం కింద 5కిలోల బియ్యాన్ని ఉచితంగా అంది స్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ పథకంలో భాగంగా మరో 5 కిలోల బియ్యానికి సరిపడా నగదును ఖాతాలోకి జమ చేస్తున్నారు. బియ్యం నిల్వలు లేకపోవడంతో ఏపీ ఎల్ కార్డులు కల్గినవారికి ఎలాంటి ప్రయోజనం దక్కడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ప్రకటించిన భార త్ బియ్యం సామాన్యులలో కొత్త ఆశలు రేకెత్తించింది. అయితే ఈ బియ్యం ఎక్కడ లభిస్తాయో తెలియక గంద రగోళం నెలకొంది. ఫిబ్రవరి 2న మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప బెంగళూరులోని నేషనల్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్) మొబైల్ సంచార వాహనాల ద్వారా బియ్యం విక్రయాలకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. బెంగ ళూరులో 5 సంచార వాహనాల ద్వారా వీటిని విక్రయిస్తు న్నామని అయితే ఇప్పటికే 600 టన్నుల బియ్యాన్ని విక్ర యించామని నాఫెడ్ కర్ణాటక విభాగానికి చెందిన ఉన్న తాధికారి జ్యోతిపాటిల్ మీడియాకు తెలిపారు. ప్రస్తుతం బెంగళూరులో కొన్ని ప్రాంతాలలో మాత్రమే 10కిలోల భారత్ బియ్యం ప్యాకెట్‌లను, 10 కిలోల గోధుమ ప్యాకెట్ లను విక్రయిస్తున్నామన్నారు. రైస్ మిల్లుల యజమాను లతో చర్చలు జరుగుతున్నాయని త్వరలో నగరంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ భారత్ బియ్యం విక్రయాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందన్నారు. ఈ పథకం ప్రారంభమైన వారంలోనే ఏకంగా 600 టన్నులు విక్రయం కావడం గమనిస్తే ఇది నల్లబజారుకు చేరుకుం దున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు తగిన సమాచారం ఇవ్వకుండా ఈ పథకాన్ని ప్రారంభించారని పలువురు విమర్శిస్తున్నారు.



మార్కెట్‌లోకి హార్లీ డెవిడ్సన్

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 22: ప్రముఖ ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటోకార్ప్, హార్లీ డెవిడ్సన్ సంయుక్త ఆధ్వర్యంలో హార్లీ డెవిడ్‌సన్ ఎక్స్ 440 ద్విచక్ర వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. నగర శివారులోని వివాహ భోజ నంబు గార్డెన్‌లో గురువారం రాత్రి ఏర్పాటు కార్యక్రమంలో ద్విచక్ర వాహ నాన్ని నరసింహ హీరో అధినేత సునీల్ రెడ్డి, హీరో మోటో కార్ప్ ఎఎస్ఎం దీపక్, టీఎస్ఓ హనుమా ఆవిష్కరించి కస్టమ ర్లకు అందించారు. మొదటి రోజు 18 వాహ నాలను డెలివరీ చేసినట్లు వారు తెలి పారు. దీని ఎక్స్ షోరూం ధర రూ.2,39,500 అన్నారు. హార్లీ డెవిడ్సన్ కంపెనీ బైక్ డ్రైవ్ చేయటం ప్రతి ఒక్కరి కల అన్నారు. అటువంటి బైక్‌ను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహా హీరో షోరూం జీఎం రాకేష్, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ద్విచక్రవాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ముఖ్యఅతిథులు